# సెకండ్ షో

సినిమా సెకండ్‌షో వదిలిపెట్టారు. హాలులోంచి మానసి, రవి ఇద్దరూ బయటికి వచ్చారు. మరేదో లోకంలో విహరిస్తున్నట్లు చేయిచేయీ కలుపుకొని హాలుముందుకు వచ్చాక రవి రిక్షా బేరంచేశాడు.

'ఆటోలో వెళదాం తొందరగా వెళ్ళొచ్చుకదా!' మానసి రిక్షా అంటే అయిష్టంగా మొహంపెట్టి అంది.

'తొందరేముంది?' అంటూ చిలిపిగా నవ్వి రిక్షాలో ఎక్కి కూర్చున్నాడు. మానసికూడా ఎక్కేసింది. మామూలువేగంతో వెళుతోంది రిక్షా.

'మానసీ! నువ్వింటికెళ్ళేసరికి మీఆయనొస్తేనో......'హఠాత్తుగా ప్రశ్నించాడు రవి.

'మరెట్లా? నాకిప్పుడు భయంగానే వుంది సుమా! క్యాంపు నుండి వచ్చేస్తే........' భయాన్ని అభినయించింది మానసి.

"యెందుకంత భయపడతావు? అంతమాత్రం జవాబు చెప్పుకోలేవేమిటి? నెరజాణవు."

'ఎట్లాచెప్పను రవీ! అసలే మీ మగవాళ్ళు అనుమానస్థులు. మా ఆయన మరీ! సినిమాకయితే తెగించి వచ్చానుగానీ ఇంటిలో ఆయన వుండి వుంటే చావబాదేస్తారేమో!'

'మానసీ! పోనీ ఒక పని చెయ్, నువ్వెప్పటికీ నాదగ్గరే ఉండిపో. అప్పుడు మీ ఆయనేకాదు ఇంకెవ్వరొచ్చినా నీమీద చేయివేస్తే చితక తంతాను...' పళ్ళమధ్య నవ్వును బిగపట్టి అన్నాడు రవి.

'ఏమిటీ? మా ఆయన్ని తంతావా? నీకెంత ధైర్యం. యెంతయినా పతిదేవులు - తాళికట్టిన భర్త! ఆయన్నేమన్నా అంటే సహించలేను.'

'అబ్బో! ఆ పతిదేవుడిమీద భక్తి బాగానేఉంది. రోజూ పాదపూజ చేస్తావా? మొత్తానికి అదృష్టవంతుడే!"

'ఏం ఆయన అదృష్టంచూస్తే నీకు ఈర్ష్యగావుందా?'

'ఊఁ ఎప్పుడూ జీవితాంతం నీ దగ్గరే ఉండిపోయి నీ కన్నుల కాంతుల వెల్లువలో తడిసి నిర్మలమైన నీ హృదయంలో తలదాచుకొని వెచ్చని నీ ఒడిలో పవ్వళించడం తలచుకుంటే అసూయగా ఉండదూ?'

'అయ్యగారికీ కవితాధార పొంగిపోతున్నదే' అని కొంచెం గొంతు తగ్గిస్తూ, 'మూడోవ్యక్తిరిక్షా తొక్కుతున్నాడు సుమా! మర్చిపోయావా!" మానసి గుర్తుచేసింది,

ఒక్కసారిగా ఉలిక్కిపడినాడు రవి. ఆ విషయం అప్పుడు గుర్తు వచ్చినట్లు ఇప్పటిదాకా ఆతనీ మాటలు వింటాడేమో నన్న ఊహరానేలేదు కాస్త హెచ్చు స్వరంతోనే ఇద్దరూ ఇష్టం వచ్చినట్లు చుట్టూ పరికించారు. ఊరంతా నిర్మానుష్యంగా నిశ్శబ్దంగా వుంది.

హఠాత్తుగా రిక్షా ఆగిపోయింది. "ఏమిటీయెటూ కాకుండా ఇక్కడా పావు రిక్షా? చైను ఊడిపోయిందా?" విసుగ్గా ప్రశ్నించాడు రవి. రిక్షా అతనేం మాట్లాడలేదు. తలప్రక్కకు తిప్పి చూస్తే పోలీస్‌స్టేషన్. రిక్షా

అతను గబగబా పోలీసుస్టేషన్‌లోకి వెళుతున్నాడు. రవికేమీ అర్థంకాలేదు. 'ఏమిటి? రిక్షా ఆపి ఎక్కడికి వెళుతున్నావు?' రవి ప్రశ్న వినిపించుకోలేదతడు. రిక్షా దిగి వెళ్ళిపోదామా అన్నంత కోపం వచ్చింది. మానసి విసుక్కుంది, 'ఆటోలో వెళదామంటే విన్నావు కాదు. చూడు అప్పుడే టైము ఒంటిగంటా పదినిమిషాలయింది.

"ఆలస్యమవుతుందని నేను మాత్రం అనుకున్నానా మానసీ! దిగి వెళదామంటే వాడి శ్రమకు డబ్బులివ్వకుండా యెలా?..."

పోలీసు స్టేషన్‌నుండి ఒక కానిస్టేబుల్ బయటకువచ్చి 'మిమ్మల్ని లోపలకు రమ్మంటున్నారు,' అన్నాడు.

రవి తెల్లబోయి 'మేమెందుకు పోలీసు స్టేషన్‌లోకి?' అన్నాడు, 'త్వరగా రండిసార్ ఇద్దరూ' తొందర చేశాడు కానిస్టేబుల్.

అయోమయంగా లోపలకు నడిచారిద్దరూ.

యెదురుగా కుర్చీలో ఇనస్పెక్టర్. ప్రక్కన రిక్షాఅతను నిల్చున్నాడు. 'మీరిద్దరూ యిప్పుడు ఎక్కడినుండి వస్తున్నారు.' అధికారికంగా ప్రశ్నించాడు ఇనస్పెక్టర్.

'సినిమా నుండి' సాధ్యమైనంత మృదువుగానే చెప్పాడు రవి.

'సెకండు షోకే ఎందుకు రావల్సివచ్చింది? ఏవీ టికెట్లు చూపించండి"... ఇనస్పెక్టర్ అధికార ప్రశ్న.

'మాకు వీలు అయినప్పుడు వస్తాము. దానికి మీకు సంజాయిషీ యిచ్చుకోవాల్సిన పనిలేదు. 'టికెట్ తీసి చూపించినా రవికి కోపంగా కసిగా ఉంది లోలోపల. కానీ ఎంతకీ లింక్ అర్థంకాక తికమక పడుతున్నాడు.

'అయితే సూటిగా అడుగుతున్నాను చెప్పండి. ఈఅమ్మాయెవరూ?' మానసిని చూస్తూ తీవ్రంగా అడిగాడు ఇనస్పెక్టర్.

అంత కోపంలోనూ నవ్వొచ్చింది రవికి ఇనస్పెక్టర్ ప్రశ్నకు, ఆమె సాక్షాత్తూ నా భార్య. పేరు మానసి' అన్నాడు.

'అబద్ధం బాబూ! వాళ్ళు భార్యాభర్తలు కానేకారు—' ఈసారి రిక్షా అతడు అన్న మాటలివి. చదువు,సంస్కారం వున్నట్లు కనిపిస్తున్నాడతడు.

అప్పుడు తట్టింది రవికి అసలు జరిగిందేమిటో! తామిద్దరూ సరదాగా మాట్లాడుకోవడం తమదేతప్పు. మానసి రవి ఒక్కసారి గట్టిగా నవ్వారు. ఈసారి రిక్షాఅతనూ ఇన్‌స్పెక్టర్ తెల్లబోయి చూశారు.

'ఇన్‌స్పెక్టర్! మేమిద్దరం భార్యాభర్తలం. రిక్షాలో సరదాకి మేం మాటలాడుకొన్న మాటలు విని ఇతను మీకు కంప్లెయింట్ చేసినట్లున్నాడు' మానసి సమాధానం చెప్పింది.

ఇన్‌స్పెక్టరు అనుమానంగా చూశాడు. మీరిద్దరూ భార్యాభర్తలని ఋజువేమిటి? మీ భర్తకు తెలియకుండా ఈయనతో మీరు సినిమాకు వచ్చారని రిక్షాఅతను చెపుతున్నాడు.

'చెప్పాంకదా! సరే ఊరికే మేం సరదాకి మాటలాడుకొన్నామని.'

రవి మాటలకు మధ్యలోనే అడ్డువస్తూ రిక్షాఅతను 'నా భార్యకూడా నా కళ్ళుకప్పి ఇట్లాగే నాటకమాడింది. అది అమాయకురాలని నమ్మాను బాబూ! చివరకు నన్నూ పిల్లల్ని వదిలి మోసంచేసి వాడితో లేచిపోయింది బాబూ!" అన్నాడు ఆవేదనగా. అతడి మాటల వెనక వున్న పరిస్థితులు రవికి సానుభూతినే కలిగించాయి. అయితే మానసికి మాత్రము చాలా కోపం వచ్చింది, లేచిపోయిన అతని భార్యతో తనని పోల్చినందుకు.

'ఏయ్! కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడు. నీ రిక్షా ఎక్కినందుకు మంచి శాస్తే చేశావు. నీ భార్య చెడ్డదైతే లోకంలో అందరి భార్యలు అంతేనా? ఇనస్పెక్టర్‌గారూ! మమ్మల్ని పంపించండి. వాడేదో అన్నాడని మర్యాదస్తుల నిలా నిల్చోబెట్టి ప్రశ్నించడం మీకు మర్యాద కాదు. ఆయనా ప్రభుత్వోద్యోగే— మానసి మాటలకు ఇన్‌స్పెక్టర్ మెత్తబడ్డాడే గానీ 'ఏంచేయాలో' పాలుపోలేదు.

రవికి యేదో హఠాత్తుగా జ్ఞాపకంవచ్చినట్లు "సార్! ఇక్కడవిజయ కుమార్ అనే ఇనస్పెక్టర్ ఉండాలి ఆయన ఉన్నారా?" అన్నాడు.

"ఉన్నాడు అతను మీకుతెలుసా?" అని ఇనస్పెక్టర్ ప్రశ్నించాడు. అవును. అతను నా ఫ్రెండ్.ఉంటే పిలిపించండి".

అదృష్టవశాత్తు అతను డ్యూటీలోనే వున్నాడు. విజయ్‌కుమార్‌ను చూడగానే ప్రాణం లేచివచ్చింది ఇద్దరికి.

"హలో రవీ నువ్వా! ఏమిటిది అర్ధరాత్రిపూట మా నిలయానికి వేం చేసారు. మానసిగారూ బాగున్నారా?"అంటూ ఆప్యాయంగా ప్రశ్నించాడు.

మే మిద్దరం భార్యాభర్తలమేనని ముందుగా ఆయనకిచెప్పు. మిగతా వివరాలు తరువాత చెప్తాను." ఇనస్పెక్టర్‌గారిని చూపిస్తూ అన్నాడు రవి.

''అదేమిట్రా ఇప్పుడెవరన్నారు మీరు భార్యాభర్తలు కారని?...',

"అదిగో ఆ రిక్షావాలా కంప్లెయింట్ చేశాడు. ఈయన నిలవేస్తున్నారు..." అంటూ విషయం వివరించాడు రవి.

విజయకుమార్ బిగ్గరగా నవ్వి "భలేవాడివోయ్ అర్ధరాత్రి మంచి కేసే దొరికింది. వీళ్ళిద్దరిదీ లవ్‌మ్యారేజ్. ఈమధ్యే పెళ్ళయింది...." అన్నాడు. ఇనస్పెక్టర్ ఇద్దరికీ పొరపాటయినట్లు చెప్పుకొన్నాడు.

ఇదంతా రిక్షావాలా గుడ్లప్పగించి చూసి బుర్రగోక్కుంటూ 'అయితే మీరు నిజంగా భార్యాభర్తలన్నమాట! నాది తప్పయిపోయింది. మన్నించండమ్మా. రండి వెళదాం నా రిక్షాలోనే దిగబెట్టేస్తాను" అన్నాడు.

రవి, మానసీ ఇనస్పెక్టర్లిద్దరికీ గుడ్‌బై చెప్పి మళ్ళీ రిక్షా ఎక్కేసరికి 2 గంటలయింది టైమ్.

'ఇవాళ భలే సెకండుషో చూశాం- జీవితంలో ఎన్నడూ మర్చిపోని అనుభవం' అన్నది మానసి.

"థ్రిల్లింగ్ కదూ! అవునూ! మరీ ఎక్కువ ఆలస్యమయిందికదా- మరి మీఆయన—"

మానసి రవిమాటలకు మధ్యలోనే అడ్డువస్తూ "చాల్లే యిక ఆపు. యిప్పటికయింది చాలదా! సమయానికి మీ ఫ్రెండే లేకపోతే అప్పుడయ్యేది మనపని. తెల్లారేదాకా అక్కడే భజనచేస్తూ కూర్చోవలసివచ్చేది' మానసి నవ్వుతూంటే రవి శృతికలిపాడు.

(విశ్వరచన పక్షపత్రిక 16-5-'77)